విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా



పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు: జడ్పీ ఛైర్‌పర్సన్

విశాలాంధ్ర-బుచ్చిరెడ్డిపాలెం: బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని 19 మరియు 20వ వార్డు వవ్వేరు గ్రామంలో జరిగినటువంటి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి గ. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం నిరుపేదలకు సైతం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్షని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారని తెలియజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగపర్చుకొని, ప్రజలు మంచి ఆరోగ్యవంతులుగా జీవించాలని, అందుకు వైద్య సిబ్బంది సర్వే పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు వైస్ చైర్ పర్సన్ లలితా రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని దీర్ఘకాలికవ్యాధులు ఉన్నవారికి కార్పొరేట్ హాస్పిటల్ చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ కోటంరెడ్డి లలితమ్మ, 20వ వార్డు కౌన్సిలర్ కత్తి శ్రీదేవి, కౌన్సిలర్లు షేక్ రహమత్ భాషా, షేక్ షకీల బేగం, పటాన్ నశ్రీన్, బెల్లం మల్లారెడ్డి, రాయచూరు సత్యనారాయణ, కందుకూరు యానాది రెడ్డి, చీర్ల ప్రసాద్, కంట అనంతమ్మ, బిట్రగుంట ప్రమీలమ్మ, మోర్ల జయంతి, వైఎస్ఆర్సిపి నాయకులు డాక్టర్ అల్లా బక్షు పాల్గొన్నారు.

సచివాలయాలను తనిఖీ చేసిన జెసి

విశాలాంధ్ర-నెల్లూరు కార్పొరేషన్ :నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో స్థానిక బాలాజీ నగర్ ప్రాంతంలోని 15/1, 15/2, 15/3, 16/1 వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాలలోని ఇన్స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిష్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ అమలును అన్ని సచివాలయాల్లో ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వైద్య సదుపాయాలు అవసరమైన అందరికీ చేరువయ్యేలా సచివాలయం హెల్త్ సెక్రెటరీలు కృషి చెయ్యాలి అని కమిషనర్ సూచించారు. ఎస్.డి.జి సర్వే, భూహక్కు సర్వే, ఎ.పి సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, సూచించిన యాక్షన్ ప్లాన్ ను అమలు చేయాలని తెలిపారు. స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు, నాడు - నేడు పనుల పురోగతి, ఆస్థి పన్ను, యూజర్ చార్జీల వసూళ్ళను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో నిబద్ధత పాటించాలని, తమకు నిర్దేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను గడువులోపు అందుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: పట్టణంలోని కోవూరు రోడ్‌లో అర్బన్ హెల్త్ సెంటర్‌ను స్థానిక శాసన సభ్యులు మానుగుంట మహీధర రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో సరైన వైద్యం కోసం పట్టణాలకు వెళ్ళవలసి వచ్చేదని, ఆసమయంలో వారు పడుతున్న ఇబ్బందులను ఎదుర్కోవడానికి ప్రజల వద్దకే ఆరోగ్య కేంద్రాలను తీసుకొని రావాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అన్ని సౌకర్యాలతో హెల్త్ సెంటర్‌లను తీసుకొచ్చారని అన్నారు. వైద్య రంగంలో దేశంలోనే సరికొత్త అధ్యాయానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఎదల పాలిట వరంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిలుస్తోంది అన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లో ఇద్దరు డాక్టర్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని, ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా వైద్యుల చేత చూపించు కోవాలన్నారు. కందుకూరు పట్టణ ప్రాంతంలో ఒక్కటే ఏరియా హాస్పిటల్ ఉందని, ఇప్పుడు రెండు వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్లు ప్రారంభించడం జరిగిందన్నారు. అందులో ఒకటి కోటారెడ్డి నగర్ లో రెండోది జనార్ధన్ కాలనీ ప్రాంతంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్లు మా ప్రాంతానికి మంజూరు చేసి ఏర్పాటు చేసినందుకు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కందుకూరు ప్రాంత ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు, మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్, వైద్యులు, అంగన్వాడీ కార్యకర్తలు, వాలంటరీలు, గృహసారథులు, వైయస్సార్ సిపి ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త చరిత్రకు శ్రీకారం సామాజిక సాధికార బస్సు యాత్ర

విశాలాంధ్ర-వరికుంటపాడు: సోమవారం ఉదయగిరి నియోజకవర్గంలో జరుగు సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతనికై సమాలోచనలు నిర్వహించి మండల ప్రజలకు పలు సూచనలు చేసిన ఉదయగిరి మాజీ ఏం సి చైర్మన్ అలీ అహ్మద్, మండల కన్వీనర్ మందలపు తిరుపతి నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు మాగంటి శ్రీనివాసులు (సిద్దయ్య)ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరికుంటపాడు మండలం నుంచి వైసీపీ శ్రేణులు, అభిమానులు భారీ ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనేలా మండల నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు ప్రయత్నం చేయాలని వారు తెలిపారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి తెలిపేలా ఈ బస్సు యాత్ర ఉంటుందని వారు అన్నారు. ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆదేశాలతో ఈ బస్సు యాత్ర ప్రతి ఒక్క కార్యకర్త తన సొంత పనిగా భావించి విజయవంతం చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు షేక్ జిలాని భాష, ఏదుపాటి సరోజినమ్మ, కుమ్మిత ప్రతాపరెడ్డి, కోడూరి కొండయ్య, పలువురు ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ, వైసీపీ ప్రజా వ్యతిరేక విధాలను తిప్పి కొట్టాలి

- ఆర్ఎస్‌పి రాష్ట్ర కన్వీనర్ సుబ్బరాయుడు

విశాలాంధ్ర - కావలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టి ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడంలో రెవల్యూషనరి సోషలిస్ట్ పార్టీ ముందుంటుందని రెవల్యూషన రి సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుబ్బారాయుడు తెలిపారు. శుక్రవారం కావలి పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్ లో మీడియా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాలు ప్రజా సమస్యలు పరిస్కారం చేయకుండా గాలికి వదిలేసాయన్నారు. ఎక్కడి సమస్యలు అక్కడ తిష్ట వేసి వున్నాయని అన్నారు. వీటిపై పోరాటాలు చేస్తున్న ప్రజాస్వామ్యవాదులపై అక్రమ కేసులు పెట్టడంతో పాటు, అనేకరకాల దాడులకు ఒడికడుతుందని మండిపడ్డారు. అలాగే దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా వున్నా 2.30 లక్షల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ లోఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజలకు సాగు, తాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉద్యోగాలు దొరకక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్తుతి నేడు రాష్ట్రంలో ఉందన్నారు. ప్రతి జిల్లాలో ఏదొక పరిశ్రమ ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి కల్పించాలని అన్నారు. ఆర్ఎస్ పి నెల్లూరు జిల్లా కార్యదర్శిగా రవికాంత్ ను ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం రవికాంత్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని తెలిపారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రాంతాలలో ఆర్ఎస్ పి పార్టీతోపాటు దాని అనుబంధ ప్రజా, విద్యార్థి, యువజన సంఘాలను బలోపేతనికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబురావు, సీమోను, రాజేష్, మనోజ్, కిషోర్, తరుణ్, మని చంద్ర, పాల్గొన్నారు.

పొదలకూరు అభివృద్ధికి అగ్ర తాంబూలం:మంత్రి కాకాణి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు : పొదలకూరు మండలంలో సుదీర్ఘకాలంగా, అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరిస్తూ, పొదలకూరు అభివృద్ధికి అగ్ర తాంబూలం వేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పొదలకూరులో రూ2.60 కోట్లతో నిర్మాణం పూర్తయిన నెల్లూరు-పొదలకూరు,పొదలకూరు-మనుబోలు లింకురోడ్డు బిరదవోలు-చాటగొట్ల ఆర్ అండ్ బి తారు రోడ్డును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మీడియాతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పొదలకూరును అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న రోడ్డు నిర్మాణాలను పూర్తి చేస్తున్నామని, ఇందులో భాగంగా పొదలకూరు ప్రధాన రహదారిని పునర్ నిర్మిస్తున్నట్లు చెప్పారు.పొదమేకల రోడ్డును పూర్తి చేసామన్నారు. రూ. 2.60 కోట్లతో నిర్మించిన బిరదవోలు-చాటగొట్ల రహదారిని ప్రారంభించమన్నారు. పొదలకూరు మండలంలో ఎక్కడా మట్టి రోడ్డు లేకుండా సిమెంట్ రోడ్లు, సైడ్ కాలవలు నిర్మించమన్నారు. మండలంలో సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలకు చూపుతున్నట్లు చెప్పారు. చుక్కల భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని 20 ఏళ్లుగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న వారికి త్వరలోనే పట్టాలు అందజేయ నున్నట్లు చెప్పారు. అసైన్మెంట్ భూములకు సంబంధించి 1469 మంది రైతులకు 2300 ఎకరాలకు ప్రతిపాదనలు తయారు చేసినట్లు చెప్పారు. పొదలకూరు ప్రజలరుణం తీసుకునేందుకు పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. అలాగేపొదలకూరు మండలంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలి మంత్రి కాకాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, 104, 108, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి విప్లవాత్మక సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయని, పేదవాడికి కార్పొరేట్ తరహా వైద్యం లభిస్తుందని చెప్పారు. పొదలకూరు ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు మంత్రి పరిశీలించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యాధునిక వైద్య పరికరాలు, పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని అన్ని ప్రభుత్వాసుపత్రిల్లో నియమించి పేదలకు వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్ కుమారి, తాసిల్దార్ వీర వసంత కుమార్, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతి నిధులు, వైద్యులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉచిత వైద్య సేవలు: కమిషనర్

విశాలాంధ్ర-నెల్లూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్దేశించిన "జగనన్న ఆరోగ్య సురక్ష" కార్యక్రమాన్ని సచివాలయాల పరిధిలో పటిష్టంగా అమలు చేయాలని, ఉచిత వైద్య సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకునేలా కార్యక్రమాలు అమలు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ కార్యదర్శులను ఆదేశించారు. నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక దండువారి వీధి, గిడ్డంగి వీధి, అరవింద్ నగర్, సాయి నిలయం వీధి, టీచర్స్ కాలనీ, నేతాజీ నగర్, రాజాగారి వీధి, బర్రెలు వీధి, జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతాల్లోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను కమిషనర్ వికాస్ మర్మత్ శుక్రవారం తనిఖీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ అమలును అన్ని సచివాలయాల్లో ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వైద్య సదుపాయాలు అవసరమైన అందరికీ చేరువయ్యేలా సచివాలయం హెల్త్ సెక్రెటరీలు కృషి చెయ్యాలి అని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, , యుఎఫ్ డబ్ల్యువో జిజియా బాయి, మెడికల్ అధికారులు, డిపిఆర్వో ప్రసాద్, హెల్త్ సెక్రటరీలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి, కాకాణి కనుసన్నల్లోనే క్వార్ట్స్ దోపిడీ :టిడిపి

చారిత్రక సిద్ధలయ్య కోనను సైతం నామరూపాల్లేకుండా చేస్తున్న వైసీపీ మైనింగ్ మాఫియా

క్వార్ట్జ్ రాబడినంతా నియోజకవర్గంలోని పేదలకు పంచాలి. సీఎం ఈ విషయంలో చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: సైదాపురం మండలంలో క్వార్ట్జ్ మైన్ల పరిశీలిన మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకుల దావా పెంచల రావు,రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య తదితరులతో కలికి క్వార్ట్జ్ మైన్లను, నిల్వలను పరిశీలించిన సోమిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోమైనింగ్ చట్టం సీఎంజగన్ రెడ్డి బూట్లకింద నలిగిపోతోంది నాలుగు సంవత్సరాల ఏడు నెలల పాలనలో మైనింగ్ చట్టానికి విలువ లేకుండా చేసేశారు వైసీపీ అధికారంలోకి రాగానే సిలికా ఖనిజంపై కన్నేశారు. లీజుదారులపై వందల కోట్ల రూపాయల ఫెనాల్టీలు వేసి వారి జుట్టును తమ చేతుల్లోకి తీసుకున్నారు లీజుదారుల వద్ద టన్ను సిలికాను రూ.150కి బలవంతంగా గుంజుకుని రూ.1485 పైగా ధరకు అమ్ముకుంటున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో జిల్లా మంత్రి కాకాణి గోవర్ధన్రెడ్డి కనుసన్నల్లో భారీ దోపిడీకి తెరలేపారు. ఈ జిల్లాలో ఇప్పటికే సిలికా, ఇసుక, మట్టి, గ్రావెల్, బూడిద చివరకు కొండలు కూడా లేపేశారు. చివరగా క్వార్ట్జ్ పై కన్నేశారు తుమ్మలతలుపూరులో ప్రభుత్వ భూమిలో మైనింగ్ చేస్తున్న జయలక్ష్మి మైనింగ్ కంపెనీ లీజు గడువు ముగిసింది.ఆ కంపెనీ లీజును రెన్యూవల్ చే యకుండా తమకు వదిలేయాలని వైసీపీనేతలు బెదిరిస్తున్నారు. సైదాపురం మండల పరిధిలో 29 క్వార్ట్జ్ మైనింగ్ లీజులు ఉండగా, చట్టప్రకారం వాటిని రెన్యూవల్ కానీయడం లేదు. క్వార్ట్జ్ విలువ పెరిగింది కాబట్టి వైసీపీ నేతలే దోచుకోవాలంట. లేదంటే లీజుదారులు నష్టానికి మైనింగ్ చేసుకోవాలంట 2 వేల ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన సిద్దలయ్య కోననూ వైసీపీ మైనింగ్ మాఫియా వదిలిపెట్టలేదు.ఆలయానికి 200 మీటర్ల పరిధిలోఎలాంటిమైనింగ్ చేయవద్దని కోర్టు ఆదేశాలున్నా ఖాతరు చేయకుండా ఏకంగా దేవుడి కొండనే తవ్వేశారు. మొదట ఎంపీలకు కూడా ఈస్కామ్ భాగస్వామ్యం ఉందని భావించాం. చివరకు తేలిందంటే ఇదంతా కాకాణి అండ్ బ్యాచ్ నిర్వాకమని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి ఆయన నియోజకవర్గమైన సైదాపురంలో పర్యటించకూడదని ఉదయాన్నే హౌస్ అరెస్ట్ చేశారు. తమ ఇళ్లవద్ద కూడా పోలీసులను మొహరించారు. సైదాపురం మండలం చుట్టూ పోలీసులు పహారా కాస్తున్నారు. చివరకు ఇక్కడకు భోజనాలను అనుమతించకూండా అడ్డున్నారు. బ్రిటీష్ కాలంలోనూ ఇంత నిర్బంధం లేదేమో. పేదల ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు తప్ప రాష్ట్రం ఒక్క రూపాయి కేటాయించడం లేదు. ఇప్పుడు ఈ క్వార్ట్జ్ ద్వారా వచ్చే రాబడిని ఒక్క ఇంటి నిర్మాణం కోసం రూ.2 లక్షలు కేటాయించాలన్నారు. కాకాణి అండ్ బ్యాచ్‌కు దోచిపెడతామంటే మాత్రం చూస్తూ ఊరుకోమన్నారు. సైదాపురం నుంచి ఉదయగిరి వరకు విస్తరించి వున్న క్వార్ట్జ్ ఖనిజం మైనింగ్‌ను నిబంధనల ప్రకారమే చేపట్టాలన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు

విశాలాంధ్ర - కావలి: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కౌన్సిల్ సమావేశంలో సుబ్బరాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోలో భాగంగా ప్రకారం మున్సిపల్ ఔట్సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలని, మాట తప్పని, మడమ తిప్పని ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి నిలబడాలని వారు డిమాండ్ చేశారు. ధరల నియంత్రణ లేకపోవడంతో కార్మికుల కుటుంబాలు చాలీచాలని వేతనాలతో తీవ్రమైన అసౌకర్యాలకు గురవుతున్నారని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, అలాగే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మున్సిపల్ కార్మికులకు డ్రైనేజీ పనులలో పనిచేస్తూ మరణిస్తే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ కార్మికుల కుటుంబానికి 40 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వారు కోరారు. మున్సిపల్ రంగంలో శాశ్వత పనిలో పని చేస్తున్న డైలీ వేజ్ కార్మికులను ఆప్కాస్ లో చేర్చి ప్రస్తుత ఒప్పంద కార్మికులకు ఎంత వేతనం చెల్లిస్తున్నారో అంతే మొత్తం ఈ కార్మికులకు కూడా ఇవ్వాలని, సాంఘిక భద్రతలో భాగమైన పిఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని, అలాగే జీవో నెంబర్ 25 ప్రకారం విధుల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు స్థానిక మున్సిపాలిటీల నుంచి 2 లక్షల రూపాయలు, ప్రమాదాల బారిన పడి మరణిస్తే 5 లక్షల రూపాయలు ఆ కుటుంబాలకు చెల్లించి వారి కుటుంబ సభ్యులను తిరిగి ఆ పనుల్లో పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు నివేశస్థలాలు ఏర్పాటు చేసి శాశ్వత గృహాలను నిర్మించాలని, పెండింగ్ లో ఉన్న డైలీ వేజ్ కార్మికుల, స్కూల్ స్వీపర్ల వేతనాలు సత్వరం విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య కార్యాచరణ రూపొందించి ఉద్యమిస్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గుంజి కిషోర్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, మహిళా కార్మికులకు ఇవ్వవలసిన ఐదు రోజుల స్పెషల్ లీవ్లను అమలు చేయకపోవడం చూస్తుంటే ప్రభుత్వ జీవోలు అంటే మున్సిపల్ అధికారులకు తేలిక భావంగా ఉందని, మా హక్కులను హరించడం సరైనది కాదని, తక్షణం వేతనాలు, సెలవు దినాలు వర్తింపజేయాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మల్లి అంకయ్య, నగర అధ్యక్ష కార్యదర్శులు ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, పట్టణ నాయకులు ప్రభావతి, రాజేష్, తన్నీరు రమాదేవి, సుభాన్, కుంచాల వేణు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మనుబోలులో కలశోద్వాసన గ్రామోత్సవాలు

-కోదండరాంపురంలో సిద్ధమైన స్టాల్స్

-నేటి రాత్రి తో ముగియనున్న దసరా ఉత్సవాలు.

విశాలాంధ్ర -మనుబోలు: మనుబోలు లో శుక్రవారం రాత్రి దేవి శరన్నవరాత్రి కలసో ద్వాసన గ్రామ ఉత్సవాలకు ఏర్పాటు పూర్తయ్యాయి.శుక్రవారం రాత్రి తో మనుబోలులో దసరా ఉత్సవాలు ముగిస్తాయి. ఈ నేపథ్యంలో కోదండరాంపురం సెంటర్లో భారీ ఎత్తున స్టాల్స్ వెలిశాయి. మహిళా మండలి వద్ద దేవి శరన్నవరాత్రి ఉత్సవాల కోసం అమ్మవారిని తొమ్మిది రోజులు పాటు వివిధ అలంకారంలతో సందడిగా ఉబయాలు జరిగాయి.ఈ ఏదాది దేవాంగుల వీధిలో పోలేరమ్మ గుడి వద్ద కూడా దసరా వేడుకలు జరుపుతున్నారు. ప్రతి ఏటా మనుబోలులో దసరా ఉత్సవాలుఘనంగా నిర్వహిస్తారు. చివరి రోజు జరిగే కలుషోద్వాసన గ్రామ ఉత్సవంతో పెద్ద ఎత్తున వచ్చిన స్టాల్స్. మినీ ఎగ్జిబిషన్మరిపిస్తుంది.మరికొద్ది సేపట్లో చుట్టుపక్కల గ్రామాల వారు. మనుబోలు కోదండరాంపురం పిడూరు యాచవరం చెర్లోపల్లి. చుట్టుపక్కల గ్రామాలతో ఈ ప్రాంతం కిక్కిరిసిపోతుంది.



కలశోద్వాసన గ్రామోత్సవానికి తెనాలి బ్రాండ్. తీన్మార్ డిస్కో తప్పెట్లు మేళం బాణాసంచాలతో రాత్రంతా కన్నుల పండుగ గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఇప్పటికే మనుబోలు లో దసరా ఉత్సవాలతో కళకళ లాడుతోంది.

పేదల ఆరోగ్యమే ఆరోగ్య సురక్ష లక్ష్యం

విశాలాంధ్ర-ముత్తుకూరు: పేదవాడి ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం లక్ష్యమనిఎంపీపీ గండవరం సుగుణ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కార్యక్రమం శుక్రవారం మండలంలోని బ్రహ్మదేవం1 సచివాలయం వద్ద ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమం ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పేదవాడి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. జడ్పిటిసి బందెల వెంకటసుబ్బయ్య, సర్పంచ్ యందోటి సుధాకర్,నాయకులు మస్తాన్, సుబ్రహ్మణ్యం, జమీల్ భాష, బషీర్ భాష, ఎంపీడీవోలక్ష్మణ కుమార్, సచివాలయ డిడిఓ వాసుదేవరావు, సచివాలయం కార్యదర్శి నిరంజన్ ,వైద్యులు చక్రవర్తి, సచివాలయ ఏఎన్ఎం చంద్రకళ, ఐసిడిఎస్ సూపర్వైజర్ మంజుల, అంగన్వాడి వర్కర్లు, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు, అలాగే సచివాలయం డిడిఓ వాసుదేవరావు అధికారులను, నాయకులను, వైద్యులను సన్మానించారు.

పాఠశాలకి మైక్ సెట్ అందించిన ఐఎఫ్‌సి ఫౌండేషన్

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: కందుకూరు పట్టణంలో గత 4 సంవత్సరంల నుండి కుల,మతాలకతీతంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో కందుకూరు పట్టణంలో ఎంతో మందికి వైద్య సేవలు అందించి,వైద్య రంగంలో తనకంటూ ఒక గుర్తింపు ఏర్పరచుకున్న డాక్టర్ సుల్తాన్ మొహిదీన్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కందుకూరు బాలికల ఉన్నత పాఠశాలకి మైక్‌సెట్‌ని కందుకూరు సిఐ నఫీజ్ బాషె ద్వారా అందించారు. ఈ సందర్భంగా సిఐ నఫీజ్ బాషా మాట్లాడుతూ ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ వారు నిర్వహించే కార్యక్రమాలు ఎంతో స్పూర్తిదాయకంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ హనీఫ్ బాషా ఫౌండేషన్ సభ్యులు, ప్రెసిడెంట్ సాజిద్, సెక్రెటరీ షంషేర్, ట్రెజరర్ హఫీజ్, ఇంఛార్జ్ అయూబ్ ఖాన్ పఠాన్, షమ్ షూద్దీన్, పాఠశాల ప్రిన్సిపాల్ ద్వారక రాణి, సిబ్బంది పాల్గొన్నారు

విద్యార్థులకు సర్టిఫికెట్‌లు పంపిణి:ప్రిన్స్‌పాల్

విశాలాంధ్ర -రాపూరు : రాపూరు లోని శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం పశుసంవర్ధక పాల్ టెక్నికల్ కళాశాలలో ఈ నెల 19 వతేది నుండి 25 వ తేది వరకు చుట్టు ప్రక్కల గ్రా మలలో పాల్ టెక్నికల్ ఫైనల్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఫైనల్ క్యాంప్ నిర్వహించి పశువులకు వివిధ జబ్బులకు వైద్యం,టీకాలు, నులిపురుగులు మందులను పంపిణి చేయడం జరిగిందని, 560 పశువులకు గర్భకోశ వ్యాధులు, వివిధ జబ్బులకు చికిత్స, నులిపురుగుల చికిత్స చేసారని ప్రిన్స్ పాల్ డాక్టర్ ఇందిరా తెలియజేసారు. డాక్టర్ ఇందిరా మాట్లాడుతు ఫైనల్ సంవత్సరం పూర్తి అయినందున శుక్రవారం ఫైనల్ వైవాను నిర్వహించి, విద్యార్థులకు కోర్స్ కంప్లీషన్ సర్టిఫికెట్‌లు ఇవ్వడం జరిగిందని డాక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమములో రాపూరు ఎడి డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ సుప్రజా, డాక్టర్ శ్రీహరి, డాక్టర్ డి.ఇందిరా, సిబ్బంది, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

అచీవ్‌మెంట్ శిక్షణ

విశాలాంధ్ర - ఉలవపాడు : మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్మెంట్ సర్వే సన్నాహక శిక్షణా కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారులు, ఎం వివి ప్రసాద్ రావు మరియు రమణయ్యలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో ఎల్ చంచమ్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నందున అందరూ సమిష్టిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ఉన్నత ప్రమాణాలలో మన మండలానికి గుర్తింపు తీసుకురావాలని కోరారు . ఈ కార్యక్రమానికి కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, సలీం భాష, జనార్ధన్, కోటేశ్వరరావు, శ్రీను, మరియు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీను, కేజీబీవీ ప్రిన్సిపాల్ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల ప్రిన్సిపాల్‌లు మరియు ప్రాథమిక పాఠశాలల హెడ్మాస్టర్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా ఎస్ఈఏఎస్ పరీక్షను నిర్వహించుటకు నియామకం పొంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పరీక్ష నవంబర్ మూడవ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందని మండలంలో 27 పరీక్షా కేంద్రాలలో నిర్వహించ బడుతుందని ఎంఈఓ తెలిపారు . మూడవ తేదీ ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు ఈ పరీక్షను 27 కేంద్రాలలో నిర్వహిస్తారని పివి రమణయ్య తెలిపారు పరీక్ష నిర్వహణ గురించి తగిన శిక్షణను టీవీల ద్వారా వివరించారు, ప్రసాద్ రావు, కృష్ణ, ధనలక్ష్మి, అమూల్య, సుశీల, ఎంఆర్సి సిబ్బంది రమాదేవి, పిచ్చిరెడ్డిలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి తగిన సహాయం చేసినందుకు ఎంఈఓకి ధన్యవాదాలు తెలిపారు

ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ఠ

విశాలాంధ్ర -రాపూరు : రాపూరు మండలంలోని జోరేపల్లిగ్రామంలో వైభవంగా శ్రీఅభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేకం శుక్రవారం శ్రీ అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేక కార్యక్రమం వేద పండితుల వేదమంత్రాలు మధ్య వైభవంగా నిర్వ హించారు ఈ సందర్భంగా ఉదయం యాగశాలలో ప్రత్యేకంగా హెూమాలు నిర్వహించి మహాపూర్ణహుతి సమర్పించారు. అనంతరం స్వామి వారికీ కలిశాల జలాలతో కలిశాభిషేకము, కుంభిషేకం, నిర్వహించారు, ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి గ్రామత్సవం నిర్వహించారు గ్రామానికి చెందిన అకిలి రమణారెడ్డి, పద్మావతమ్మల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నేడుపోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవం

పోలీస్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు

విశాలాంధ్ర - రాపూరు : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రాపూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ మలిశెట్టి ప్ర భాకర్, ఎస్ఐ మాల్యాద్రి ప్రత్యక్ష పర్యవేక్షణలో గూడూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ల పర్యవేక్షణలో రాపూరు ప్రభుత్వ వైద్యాధికారి, డాక్టర్ల అధ్వర్యాన దేశం మరియు రాజ్యాంగ పరిరక్షణ కోరకు ప్రాణం త్యాగంతో సమాజానికి బంగారు బాట లను నిర్మించిన అమర్ వీరుల సంస్మరణ దినం సందర్భంగా రాపూరు పోలీస్టేషన్ ప్రాంగణం లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడమైనది దేశం కోసం ప్రా ణత్యాగం చేసిన అమర్ వీరుల కోసం ప్రజలకోసం రక్తం దానం చేయండి అమరవీరులకు నివాళులర్పించండి.

ఓటర్ డ్రాఫ్ట్ రోల్ 2024 జాబితా విడుదల

విశాలాంధ్ర-నెల్లూరు కార్పొరేషన్: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని సిటీఅసెంబ్లీ నియోజకవర్గం - 117, ఓటర్ మూల జాబితా రోల్- 2024 లిస్ట్ ను కమిషనర్ వికాస్ మర్మత్ శుక్రవారం విడుదల చేసారు. కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓటరు జాబితాను ప్రకటించిన అనంతరం కమిషనర్ మాట్లాడుతూ విడుదల చేసిన ఓటరు జాబితాలను సంబంధిత అన్ని పోలింగ్ స్టేషన్లతో పాటు నగర పాలక సంస్థ కార్యాలయంలో పరిశీలనకు ఉంచామన్నారు. బిఎల్ వోల నిర్వహణలో ఇంటింటి విచారణ అనంతరం, అన్ని రకాల ఫారంలను క్షుణ్ణంగా పరిశీలించి జాబితాను రూపొందించామన్నారు. సవరణల అనంతరం జాబితా తుది దశకు చేరిన నూతన జాబితాను ఓటర్లందరూ పరిశీలించుకుని వివరాలను సరిచూసుకోవాలని కమిషనర్ సూచించారు. జనవరి 5,2024వ తేదీనాటికి జాబితా సవరణలను పూర్తి చేసి ఫైనల్ డ్రాఫ్ట్ రోల్‌ను ప్రకటిస్తామని కమిషనర్ వెల్లడించారు. ప్రస్తుత జాబితాలో చేర్పులు ఉన్నవారు సంబంధిత బి.ఎల్.ఓ లను సంప్రదించి సవరణలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో ఏ.ఈ.ఆర్.ఓ లు దేవీ కుమారీ, ధనుంజయ రెడ్డి, దశయ్య, ఎలక్షన్ డి.టి మాధవి,చక్రపాణి, టౌన్ ప్లానింగ్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో డయాగ్నస్టిక్స్ సెంటర్: ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శాఖ నందు చైర్మన్ తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం ఐఆర్సిఎస్ - వైఆర్జికేర్ డయాగ్నస్టిక్స్ సెంటర్‌ను ప్రారంభించారు. ముందుగా రెడ్ క్రాస్ ఫౌండర్ సర్ జీన్ హెన్రీ డ్యూనాంట్ ఫోటోకు పూల మాల వేసి, జ్యోతి ప్రజ్వలన గావించి అనంతరం ఈ సెంటర్ నందున్న అత్యాధునికమైన ల్యాబ్ పరికరాలను పరిశీలించారు. అనంతరం ఈ సెంటర్ నందు అన్ని రకాల రక్త పరీక్షలను అతి తక్కువ ధరలతో మెరుగైన ఫలితాలను అందించే విధంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ జనరిక్ మెడికల్ షాపును ప్రారంభించి ప్రజలకు అతి తక్కువ ఖర్చులకే మందులను అందిస్తూ సేవలను అందిస్తుందని ఈ ల్యాబ్‌ను అతి తక్కువ ఖర్చులతో అందరికి ఉపయోగపడేలా ఉండేలా ఉంటుందని తెలియజేస్తూ, రాబోయే కాలంలో డాక్టర్ల వసతిని కూడా ఏర్పాటు చేసి వైద్య సేవలను కూడా ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్-చైర్మన్ దామిశెట్టి సుధీర్ నాయుడు, ట్రెజరర్ పి సురేష్ కుమార్ జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్, కలికి శ్రీహరి రెడ్డి కన్వీనర్లు పి.లోకేష్, యు.మురళీకృష్ణ, ఎ.సాయిరాం కో-కన్వీనర్ ఎస్.రవీంద్ర రెడ్డి రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర- బిట్రగుంట: బోగోలు మండలంలోని పాతబిట్రగుంట సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి కావలి శాసనసభ్యుడు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పలువురు లబ్ధిదారులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్ది నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డిప్రభుత్వం పనిచేస్తుందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి కార్యక్రమాన్ని రిబ్బన్ కటింగ్ చేసి జువ్వలదిన్నె గ్రామపంచాయతీ వడ్డీపాలెంలో కొత్తగా నిర్మిస్తున్న పాఠశాల భవనానికి భూమి పూజచేశారు. పై కార్యక్రమంలో ఆయన వెంట మండల కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు జడ్పిటిసి కీర్తన సర్పంచ్ శ్రీరామ్ గోపాల్ ఎంపీటీసీ మాధవరెడ్డి సురేంద్రరెడ్డి సుంకే మాల్యాద్రి ఉప్పాలమాచర్ల డిఎం అండ్ హెచ్ ఓ పెంచలయ్య వైద్యాధికారులుడాక్టర్ రాజశేఖర్ ప్రవీణ్ కుమార్ సిడిపిఓ సౌజన్య సూపర్వైజర్ కోటేశ్వరి అన్ని శాఖల అధికారులు సచివాలయసిబ్బంది ఆశా కార్యకర్తలు అంగన్వాడి కార్యకర్తలు వాలింటీర్లు ఉన్నారు

విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్ పై దాడి

విశాలాంధ్ర - కావలి : విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్ పై విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన కావలి పట్టణంలో గురువారం రాత్రి జరిగింది. బస్సు కండక్టర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరు నుండి విజయవాడ వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సు పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వద్దకు వచ్చేసరికి రోడ్డుపై కారు అడ్డంగా ఉండటంతో డ్రైవర్ బిఆర్ సింగ్ హారన్ కొట్టడం జరిగింది. హారన్ మోగించడంతో ముందు వెళుతున్న కారులోని వ్యక్తులు డ్రైవర్‌పై దాడికి యత్నించారు. స్థానికంగా ఉండే వ్యక్తులు, పోలీసులు వారిని వారించి, గొడవను సద్దుమణిగించి అక్కడ నుండి పంపించి వేశారు. అయితే కారులోని వ్యక్తులు మద్దూరుపాడు సమీపంలో మాటు వేసి, అటుగా వస్తున్న బస్సును అడ్డుకొని డ్రైవర్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. అడ్డుకోబోయిన కండక్టర్‌ను నెట్టివేశారు. ఫోటోలు తీస్తున్న ప్రయాణికుల ఫోన్ ను ధ్వంసం చేశారు. తీవ్రంగా గాయపడిన బస్సు డ్రైవర్ ను కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చంద్రబాబు కోసం అమ్మవారికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - కావలి: తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆరోగ్యంగా ఉండాలని, సత్వరం జైలు నుండి విడుదల కావాలని కోరుతూ తెలుగుదేశం నాయకులు శుక్రవారం రాత్రి ముసునూరు మహాలక్ష్మమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబు న్యాయం జరగాలంటూ 101 టెంకాయలను కొట్టి వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుంటుపల్లి శ్రీదేవి చౌదరి, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, పట్టణ ఉపాధ్యక్షుడు గుత్తికొండ కిషోర్ బాబు, బొట్లగుంట శ్రీహరి నాయుడు, పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

వైద్యుల, ఆసుపత్రుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి

- వైద్యుల రక్షణ చట్టం పటిష్టం చేయాలి - ఆసుపత్రులకు ఏకగవాక్ష విధానంలో అనుమతులు
- ఆసుపత్రుల ఏర్పాటుకు రాయితీలు ప్రకటించాలి - ఐఎంఏ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ

విశాలాంధ్ర - కావలి : వైద్యుల, ఆసుపత్రుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ కోరారు. శుక్రవారం ఐఎంఎ కావలి శాఖ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన కావలి నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. భారతీయ వైద్య సంఘం (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ప్రపంచంలోనే అతి పెద్ద వృత్తి సంఘమని, మన దేశంలో అన్ని రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలలో 1760 శాఖలలో నాలుగు లక్షల మంది వైద్యులు సభ్యులుగా వున్నారని, మన రాష్ట్రంలో 98 శాఖలలో ఇరవై వేల మంది పైగా సభ్యులున్నారని చెప్పారు. ఐఎంఏ అంటే ప్రైవేట్ వైద్యుల సంఘం అనే అపోహ ఉందని, కానీ తమ సంఘం సభ్యులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో, వైద్య కళాశాలలో సేవలు అందిస్తున్నారని అన్నారు. ఇటీవల కాలంలో ఆసుపత్రులపై, వైద్యులపై భౌతిక దాడులు దేశవ్యాప్తంగా పెరిగి పోతున్నాయని, వాటిని నివారించి వైద్యులు తమ వైద్య సేవలు ప్రశాంత వాతావరణంలో అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావలసిన అవసరం ఉందని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి 2008 లో దేశంలోనే మొట్టమొదటిసారిగా వైద్యులపై, ఆసుపత్రులపై దాడుల నిరోధానికి చట్టం తీసుకువచ్చారని తర్వాత 16 రాష్ట్రాల్లో ఇదే విధమైన చట్టాన్ని తెచ్చారని తెలిపారు. ఇటీవల కేరళలో యువ వైద్యురాలు వందనాదాస్ హత్యకు గురైన నేపథ్యంలో, కేరళలో ప్రస్తుతమున్న ఆ రాష్ట్ర వైద్య రక్షణ చట్టాన్ని కఠిన తరం చేస్తూ గత నెలలో చట్ట సవరణ చేశారన్నారు. దేశవ్యాప్తంగా అమలు చేయడానికి అనుకూలంగా జాతీయస్థాయిలో వైద్యుల, ఆసుపత్రుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి ఐఎంఏ జాతీయ సంఘం, రాష్ట్ర సంఘాలు కొన్ని సంవత్సరాలుగా పలు సందర్భాలలో విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని, కేంద్ర ప్రభుత్వం కూడా జాతీయ స్థాయి వైద్యుల రక్షణ చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. వైద్యులపై నిర్లక్ష్యం ఆరోపణలపై కేసులు నమోదు చేసినప్పటికీ, వైద్యులని అరెస్టు చేయడానికి ఆస్కారం లేదని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి నిర్దిష్టమైన ఒకే విధానం అన్నిచోట్ల అమలు చేసేలా పలు రాష్ట్రాలలో ఉన్న విధంగా రాష్ట్ర హోం శాఖ అన్ని జిల్లాల పోలీసు అధికారులకు, పోలీస్ స్టేషన్లకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అధిక సంఖ్యలో గ్రామీణ వైద్యుల పేరుతో ప్రాథమిక చికిత్స అందించడానికి పరిమితం కాకుండా, తమకు శిక్షణ లేని వైద్యం అందిస్తూ ప్రజలకు హాని కలిగిస్తున్నారని, అనవసరంగా శక్తివంతమైన యాంటీ బయాటిక్ మందులను విస్తృతంగా వాడడం వల్ల వారికి తీవ్రమైన జబ్బులు వచ్చినప్పుడు ఆ మందులు పనిచేయని పరిస్థితికి దారి తీస్తున్నాయన్నారు. శిక్షణ లేని వైద్యం చేస్తున్న కిలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా నేషనల్ మెడికల్ కమిషన్ సూచనల మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. సామాజిక బాధ్యతలో భాగంగా పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన సదస్సులు,విద్యా సంస్థలలో ఆరోగ్య సదస్సులు, కౌమార బాలికల ఆరోగ్య పరిరక్షణ కోసం రక్తహీనత నిర్ధారణ వంటి అనేక కార్యక్రమాలు, ఆరోగ్య సంబంధమైన జాతీయ, అంతర్జాతీయ దినోత్స వాలు నిర్వహించి జబ్బులు రాకముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజ లకు అవగాహన పెంచడానికి ఐఎంఏ శాఖలు అనుబంధ మహిళా విభాగాలు కృషి చేస్తున్నాయన్నారు. ఐఎంఏ జాతీయ నినాదం ఆవో గావో చలే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఐఎంఏ శాఖ ఒక గ్రామాన్ని దత్తతకు తీసుకుని ఆ గ్రామంలో సమగ్ర ఆరోగ్య రక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ, కావలి ఐఎంఏ శాఖ అధ్యక్షులు డాక్టర్ బి. సతీష్, కార్యదర్శి డాక్టర్ శ్రీధర్, సీనియర్ వైద్యులు డాక్టర్ శ్రీరాం మనోహర్ బాబు, డాక్టర్ సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ గోపి, కోశాధికారి డాక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు దాతలు ముందుకు రావాలి: ఎంపీ ఆదాల

విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు : సమాజంలో ప్రజాపయోగ కార్యక్రమాలను ఎక్కువ శాతం నిర్వహించేందుకు మరింతమంది దాతలు ముందుకు రావాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని 29వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ వెంకటరెడ్డి నగర్ లో గంట రమణయ్య నాయుడు సొంత నిధులతో నిర్మించినమున్సిపల్ ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే ప్రజా ఉపయోగ కార్యక్రమాలను చేపట్టేందుకు ఎక్కువమంది దాతలు ముందుకు రావాలని కోరారు. పెద్ద మనసుతో పిల్లల విద్య కోసం సొంత నిధులతో అన్ని వస్తువులతో నూతనంగా పాఠశాలను నిర్మించడం అభినందనీయమన్నారు. నాణ్యమైన విద్యను పేద ప్రజలకు అందించాలన్న మంచి సంకల్పంతో మంచి ప్రభుత్వ పాఠశాలను నిర్మించిన గంట రమణయ్య నాయుడును ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని ఎంపీ కోరారు. ఇంతటి గొప్ప కార్యక్రమాని చేపట్టిన దాత గంట రమణయ్య నాయుడును మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాని ఎంపీ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే నాడు-నేడు పథకం ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేటు పాఠశాలలు దీటుగా తయారుచేసి కార్పొరేట్ స్థాయిలో ఇంగ్లీష్ మీడియంతో కూడిన విద్యను పేద,మధ్య తరగతి పిల్లలకు అందించడం జరుగుతుంది అన్నారు. మంచి నాణ్యమైన భోజన వసతిని కూడా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తూ విద్యకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే ఒక ఆంధ్రప్రదేశ్‌లో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి, పాఠశాల నిర్మాణ దాత గంట రమణయ్య నాయుడు, విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు టీవీఎస్ కమల్, జిల్లా పార్టీ ఈసీ మెంబర్ సిహెచ్ సూరి బాబు, కొండ సాయిరెడ్డి, అమర్నాథ్, పార్టీ సీనియర్ నాయకులు స్వర్ణ వెంకయ్య, పేర్నాటి కోటేశ్వర్ రెడ్డి, యేసు నాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధికి శాశ్వత చిరునామా చంద్రబాబు

ఆయనది రామరాజ్యం... జగన్ ది రావణకాష్టం

కందుకూరులో మహీధర్ రెడ్డి నియంత పాలన -మున్సిపల్ ఎన్నికలకు ఆయనే అడ్డంకి - శాసనమండలి మాజీ చైర్మన్

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: టిడిపి ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 60 మందికి కుట్టు మిషన్లు పంపిణీముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏలుబడిలో రాష్ట్రం రావణ కాష్టంలా మారిందని శాసనమండలి మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ మహమ్మద్ అహ్మద్ షరీఫ్ విమర్శించారు. ప్రజలను కులాలు, మతాలు వారీగా విభజించి కుట్ర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో, మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఉదయం జరగగా, షరీఫ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటూరి నాగేశ్వరరావు అధ్యక్షతన కందుకూరులోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో షరీఫ్ మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్, తర్వాత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో తెలుగు రాష్ట్రాలలో బడుగు బలహీనవర్గాల కు అండగా నిలిచారని గుర్తు చేశారు. రెండు రూపాయలకే కిలో బియ్యం, పక్కా ఇళ్ల నిర్మాణం, జనతా వస్త్రాల పంపిణీ, ఆస్తిలో మహిళలకు సమాన హక్కు, తదితర పథకాల ద్వారా స్వర్గీయ ఎన్టీఆర్ పేదల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని అన్నారు. తరువాత చంద్రబాబు నాయుడు పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశ చరిత్రలోనే ఎక్కడా అమలు జరగలేదన్నారు. చంద్రబాబు అంటేనే శాశ్వత అభివృద్ధికి చిరునామా అని, అంతటి గొప్ప వ్యక్తిని జైల్లో పెట్టి జగన్మోహన్ రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నాడని విమర్శించారు. రాజకీయ ఆధిపత్యం కోసం, తెలుగుదేశం పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేక స్కిల్ డెవలప్మెంట్ అంశాన్ని సాకుగా చూపి అక్రమంగా కేసులు పెట్టించిన ఘనత జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. 50 రోజులు గడుస్తున్నా చంద్రబాబుపై అభియోగాలను రుజువు చేయలేక పోయారని, ఆయన త్వరలోనే నిర్దోషిగా బయటకు వస్తారని షరీఫ్ అన్నారు. ముస్లిం మైనారిటీల అభివృద్ధి కోసం చంద్రబాబు చేసిన కృషిని ఎప్పటికీ మరిచిపోలేమని షరీఫ్ పేర్కొన్నారు. రంజాన్ తోఫా, దుల్హన్ పథకం, మైనారిటీ కార్పొరేషన్ రుణాలు, ఇమామ్, మౌజాన్ లకు గౌరవ వేతనాలు, షాది మహల్ నిర్మాణాలు... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో కార్యక్రమాలకు చంద్రబాబు శ్రీకారం చుట్టారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నిపథకాలు అమలవు తున్నాయో, ఎన్ని పథకాలు ఆపివేశారో ముస్లిం ప్రజానీకం ఒకసారి గుర్తు చేసుకోవాలని కోరారు. 2012 నుంచి కందుకూరులో మున్సిపల్ ఎన్నికలు జరగలేదని, కోర్టులో కేసులు వేయించి ఎన్నికలు జరగకుండా ఎమ్మెల్యే అడ్డుపడుతున్నారని అన్నారు. కందుకూరు నియోజకవర్గంలో వైసీపీ నేతల అవినీతి, అక్రమాలు భారీ స్థాయిలో జరుగుతున్నట్లు అర్థమవుతోందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ వాస్తవాలన్నీ గ్రహించి, రాబోయే ఎన్నికల్లో వైసీపీని ఓడించాలని షరీఫ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు పేద ప్రజలకు అండగా నిలుస్తున్నాయని షరీఫ్ పేర్కొన్నారు. ఇన్చార్జిగా నియమితులైన ఏడాదిన్నర సమయంలోనే ప్రజలకు ఇంత దగ్గరగా చేరువ కావడం, సొంత నిధులు వెచ్చించి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా మిషన్లు అందించడం చాలా గొప్ప విషయం అన్నారు. రాబోయే రోజుల్లో ఇంటూరి నాగేశ్వరరావు తన సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారని, నియోజకవర్గ ప్రజలు ఆయనను ఆశీర్వదించాలని షరీఫ్ కోరారు. కుట్టు శిక్షణ పొంది, మిషన్లు అందుకున్న మహిళలు, వాటిని సద్వినియోగం చేసుకొని మరింత కష్టపడి కుటుంబాలకు ఆసరాగా నిలబడాలని షరీఫ్ సూచించారు.ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను ఇన్చార్జిగా నియమితులైన తర్వాత, ప్రతిరోజు గ్రామాలలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. ఇంటింటికి మీ ఇంటూరి కార్యక్రమంలో భాగంగా, పేదల ఇళ్లకు వెళ్లినప్పుడు వారు పడుతున్న ఇబ్బందులను స్వయంగా చూశానని, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వీలుగా కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మంగళగిరిలో స్త్రీ శక్తి పేరుతో నారా లోకేష్ ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తుండగా, దానిని స్ఫూర్తిగా తీసుకొని కందుకూరు నియోజకవర్గం లో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు నాగేశ్వరరావు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముచ్చటగా జి ప్లస్ త్రీ అపార్ట్మెంట్లను నిర్మిస్తే, ఇంతవరకు వాటిని లబ్ధిదారులకు అప్పగించడం కూడా చేతకాలేదని స్థానిక ఎమ్మెల్యే పై విమర్శలు గుప్పించారు. పైగా ఎంఐజి లేఅవుట్ అన్న పేరుతో లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డారని, జగనన్న కాలనీలకు మట్టి తోలకం పేరుతో ఎన్ని కోట్లు మింగేశారో అందరికీ తెలుసన్నారు. మద్యం మాఫియా, మట్టి మాఫియా, ఇసుక మాఫియా ఇలా అన్నిటినీ కనుసన్నల్లో నడిపిస్తూ ఎమ్మెల్యే అండ్ గ్యాంగ్ దోచేసుకుంటున్నారని ఆరోపించారు. ఆడపడుచులంతా తనను సోదరుడిగా భావించి, ఈసారి ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని, నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ సేవకుడిగా ఉంటానని నాగేశ్వరరావు తెలిపారు.నియోజకవర్గ పరిశీలకురాలు కుసుమ కుమారి మాట్లాడుతూ ఇంటూరి నాగేశ్వరరావు లాంటి మంచి వ్యక్తి, సేవా భావం మెండుగా ఉన్న వ్యక్తి కందుకూరు ప్రజలకు దొరకటం అదృష్టం అన్నారు. మహిళలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేం దుకు, తనవంతుగా కుట్టుశిక్షణా కేంద్రం ఏర్పాటు చేయడం అభినందిం చదగ్గ విషయమన్నారు. మహిళలంతా నాగేశ్వరావుకి మద్దతు పలకాలని సూచించారు. చివరిగా కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 60 మంది మహిళలకు కోర్సు సర్టిఫికేట్లు, కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా మహిళలందరూ ఇంటూరి నాగేశ్వరరావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వర రావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నీ రోశయ్య, పార్టీ సీనియర్ నాయకులు కంద్రా మాల్యాద్రి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నాదెళ్ల వెంకట సుబ్బారావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య, రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి కూనం నరేంద్ర, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్, నెల్లూరు పార్లమెంట్ పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, పార్లమెంట్ మహిళా కమిటీ అధికార ప్రతినిధి బత్తిన ఆదెమ్మ, నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు మాల్యాద్రి , పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సలాం, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పొడపాటి మహేష్, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా , పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు వేణు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు సవిడిబోయిన వెంకట కృష్ణ, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పులి నాగరాజు, పట్టణ మహిళా కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ, ఎంపీటీసీ దార్ల ఎలమందమ్మ, కందుకూరు మండల మహిళా కమిటీ అధ్యక్షురాలు మన్నం శైలజ, పార్టీ నాయకులు వడ్డెళ్ళ రవిచంద్ర, పసుపులేటి శ్రీనివాసులు, సింగమనేని పద్మ, అల్లం సుమతి, కంసాని మయూరి, జియావుద్దీన్, రూబీ, ఫాజిల్, ఫిరోజ్, రఫీ, కుట్టు శిక్షణా కేంద్రం ట్రైనర్లు యాస్మిన్, లలిత ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

నోటీసు బోర్డులో ఈ-పంట అర్హుల జాబితా

విశాలాంధ్ర-ముత్తుకూరు: ఈ పంట అర్హుల జాబితాను నోటీసు బోర్డులో పెట్టడం జరిగిందని ఇందుకూరుపేట వ్యవసాయ శాఖ ఏడిఏ రాజకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బ్రహ్మదేవం, తాళ్లపూడి, మల్లూరు రైతు భరోసా కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం మల్లూరు రైతు భరోసా కేంద్రంలో రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంట అర్హుల జాబితాలను నోటీసు బోర్డులో పెట్టడం జరిగిందని ఈ జాబితాలో ఏవైనా పొరపాట్లు ఉన్నట్లయితే ఈనెల 29 లోగా రైతు భరోసా కేంద్రాలలో తమ అభ్యంతరాలను తెలియజేయాలన్నారు. అలాగే ఈ జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అలాగే ఈ పంట నమోదు ఆధారంగానే పంటల భీమా, పంట కొనుగోళ్లు, పంట నష్ట పరిహారం వంటివి అందుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని జోత్స్నారాణి, విఏఏ జగదీష్, రైతులు పాల్గొన్నారు.

గౌస్ ఏ పాక్ 40వ గంధ మహోత్సవం

విశాలాంధ్ర-అనుమసముద్రంపేట: ఏఎస్ పేట మండలం అనుమసముద్రం పంచాయతీ పరిధిలోని జామా మసీద్ వద్ద గౌసే ఏ పాక్ నిషాన్ ముబారక్ 40వ గంధ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. జామా మసీద్ గుల్షన్ ఎ నషీన్ సజ్జా దా నషీన్ సయ్యద్ షా ఖాజా ఆఫ్జార్ రఫాయి తాజ్మీ హుస్సేన్ బసరవి సూఫీ స్వామి ఆధ్వర్యంలో గంధ మహోత్సవం నిర్వహించారు. గౌస్ ఏ పాక్ జామా మసీదు వద్ద గంధం కలిపి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాణాసంచా పేలుళ్ళ ఫకీర్ల డబ్బు వాయిద్యాలు పూల చెద్దర్లతో ఏ ఎస్ పేటలోని శ్రీ హజరత్ వారి దర్గాకు గంధం తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం గౌస్ ఎ పాక్ నిషాన్ వద్దకు గంధం తీసుకువెళ్లారు. ప్రార్థనల అనంతరం భక్తులకు గంధం పంచి పెట్టారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

డ్రైవర్ పై కేసు నమోదు

విశాలాంధ్ర-లింగసముద్రం: మండల పరిధిలోని ముత్యాలపాడు గ్రామ సమీపంలో మన్నేరు నది నుండి ఎలాంటి అనుమతులు లేకుండా చూసుకొని అక్రమంగా తరలిస్తున్న డాక్టర్ను సిబ్బందితో పక్కా సమాచారంతో కాపు కాసి శుక్రవారం ఎస్ఐ బాజీ బాబు స్వాధీన పరుస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న డ్రైవర్ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్కు తరలించి కేసు నమోదు చేశారు ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల పరిధిలో ఇసుక మట్టి ఎవరు అక్రమంగా తరలించిన చర్యలు ఉంటాయని క్రిమినల్ కేసులో నమోదు చేస్తామన్నారు.

శీనయ్యకు నివాళులర్పించిన కావ్య కృష్ణారెడ్డి

విశాలాంధ్ర - కావలి: పట్టణంలోని ముసునూరుకు చెందిన పోతిపోగు శీనయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలుగు దేశం నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త, కావ్య కృష్ణారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి శీనయ్య భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ పంట నమోదు చేసుకున్న రైతుల పేర్లు ప్రదర్శన

విశాలాంధ్ర -కందుకూరు రూరల్: కందుకూరు మండలంలోని పాలూరు రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ 2023 సీజన్ లో వేసిన పంటలకు ఈ పంట నమోదు చేసుకొన్న రైతుల పేర్లను సామాజిక తనిఖీ కొరకు ముసాయిదా జాబితాను రైతులకు గ్రామ వ్యవసాయ సహాయకుడు సీ హెచ్ బ్రహ్మయ్య రైతు భరోసా కేంద్రం నందుగల బోర్డు పై ప్రదర్శించటం చేయటం జరిగినది, ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి వి. రాము విచ్చేసి రైతులందరూ ఖరీఫ్ సీజన్లో వేసిన పంటలు, సర్వే నంబర్, ఖాతా నెంబరు,విస్తీర్ణం, పంట సాగు విధానం అన్నింటినీ పొందుపరచడం జరిగినది రైతులు అన్ని సరిచూసుకుని ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే ఈ నెల 29తేదీ లోపల తెలియజేయాలని కోరారు. అలాగే జాబితాలోని అన్ని పేర్లను గ్రామ వ్యవసాయ సహాయకుడు సీ హెచ్ బ్రహ్మయ్య చదివి వినిపించారు. ఇలాగే మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. తుది జాబితాను నవంబర్ 1వ తేదీన ప్రదర్శిస్తామన్నారు. ఈ పంట నమోదు ఆధారంగా రాబోయే రోజుల్లో పంట అమ్ముకోవడం, పంట నష్ట పరిహారం, పంటల భీమా సౌకర్యం వుంటుందని మండల వ్యవసాయాధికారి తెలియజేశారు,పై కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి



విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: మహిళల ఆర్థిక అభివృద్ధికి అదాని ఫౌండేషన్ కృషి చేస్తుందని అదాని ఫౌండేషన్ సదరన్ రీజినల్ సీఎస్ఆర్ హెడ్ అనిల్ బాలకృష్ణనన్ తెలిపారు. శుక్రవారం కృష్ణపట్నం పోర్ట్ లోఅదానీ ఫౌండేషన్ మద్దతుతో, 10 మహిళా స్వయం సహాయక సంఘాలుఅదానీ కృష్ణపట్నం పోర్ట్ లో ఒక్కరోజు ఎక్స్‌పోను నిర్వహించాయి. 120 మందికి పైగా మహిళలు పురుషులు ఎక్స్‌పోలో పాల్గొన్నారు రోజువారీ వినియోగం సంబంధించిన చేతితో తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శననిర్వహించారు. ఎక్స్‌పోలో ప్రదర్శించిన ఉత్పత్తులు జనపనార సంచులు, తాటి ఆకుల బుట్టలు దీపపుస్తంభాలు,సబ్బులు,ఊరగాయలు, ఫ్లోర్ క్లీనర్‌లు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, ఎడిబుల్ ఆయిల్ చికీలు మొదలైనవి ప్రదర్శించారు కార్పోరేట్ వ్యవహారాల హెడ్ వేణుగోపాల్ మహిళ ఉత్పత్తులను తిలకించి వారిని అభినందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఉత్పత్తులను మహిళలు తయారు చేయడం హర్షనీయమన్నారు ఆయన పలు ఉత్పత్తులను కొనుగోలు చేశారు. అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ సర్వీస్ కంపెనీల ఉద్యోగులు పైన పేర్కొన్న రోజువారీ వినియోగ ఉత్పత్తులను కొనుగోలు చేశారు. మహిళలు తమ ఆర్థిక అభివృద్ధికి అదాని ఫౌండేషన్ చేయూతను అందించడంతోపాటు వారి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో రాజేష్ రంజన్ గంగా సతీష్, హెచ్ ఆర్డి జియం .సి హెచ్ శ్రీనివాసులు, రమేష్ బాబు పాల్గొన్నారు.